తల్లుల ఎదురుచూపులు

- అందని 'తల్లికి వందనం'
- కుటుంబంలో ఒక్కరికే ఇస్తారన్న ప్రచారంపై సర్వత్రా ఆందోళన
- ఫీజుల కోసం ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం ఒత్తిడి
- గత ప్రభుత్వంలో ఇప్పటికే అందిన 'అమ్మ ఒడి'

జి.కొండూరు/తిరువూరు: తాము అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కో విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. పాఠశాలలు ప్రారంభమై అప్పుడే రెండో నెల జరుగుతోంది. అయినప్పటికీ తల్లికి వందనం అమలు కాలేదు. ఈ పథకం అమలులో జరుగుతున్న జాప్యం కారణంగా విద్యార్థుల తల్లులు ఆందోళనకు గురవుతున్నారు. ఒక పక్కన ప్రైవేటు పాఠశాలల ఫీజుల మోత, మరో పక్కన ఆర్థిక ఇబ్బందులతో పేద కుటుంబాలు ప్రభుత్వం అమలు చేస్తానన్న తల్లికి వందనం ఆర్థిక సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఒక్కరికేనన్న ఆందోళన

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన అమ్మ ఒడి కార్యక్రమాన్ని పేరు మార్చి తల్లికి వందనం పేరుతో స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామంటూ ఎన్నికల ముందు ఎన్డీయే కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కానీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఆర్థిక సాయం అందించేలా జీఓ ఇచ్చిందన్న ప్రచారం జరుగుతుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన ప్రారంభమైంది. ఈ పథకం అమలుకు అనేక ఆంక్షలను సైతం పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడంతో పాటు కాలయాపన చేసేందుకు కూడా కుట్ర పన్నినట్లు ప్రచారం జరుగుతుండడంతో ఈ పథకం అమలుపై పిల్లల తల్లులలో అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో ఈ పాటికే అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో నగదు జమ అయ్యేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



కూటమి మేనిఫెస్టోలో ప్రతి విద్యార్థికి రూ.1500 ఇస్తామన్న హామీ (సర్కిల్‌లో)

ఫీజుల కోసం ఒత్తిడి

ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, కిట్లు అందించినా, అవసరమైన విద్యా సామగ్రి, ఇతర ఖర్చులు, ప్రైవేటు సంస్థల్లో విద్యార్థుల పుస్తకాలు కొనుగోలు, యూనిఫామ్స్, షూస్ అంటూ అనేక ఖర్చులు ఉండటంతో పేద, మధ్య తరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరో వైపు ఫీజుల కోసం అప్పుడే ఒత్తిడి ప్రారంభమవడంతో ఆయా వర్గాల బాధ వర్ణనాతీతంగా ఉంది. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం అందించి తమ ఇక్కట్లను తీర్చాలని తల్లులు కోరుతున్నారు.

మైలవరం నియోజకవర్గంలో..

మైలవరం నియోజకవర్గ పరిధిలో గత సంవత్సరం జి.కొండూరు మండలంలో 7,091 మంది, ఇబ్రహీంపట్నం మండలంలో 18,683 మంది, రెడ్డిగూడెం మండలంలో 5,193 మంది, మైలవరం మండలంలో 12,219 మంది, విజయవాడ రూరల్ మండలంలో 30,666 మంది మొత్తం కలిపి 73,852 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుకున్నారు. గత సంవత్సరం సంఖ్య కంటే ఈ సంవత్సరం మరో పది శాతం మంది విద్యార్థులు అదనంగా పాఠశాలల్లో చేరుతున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో చేరిన విద్యార్థులు అందరూ ప్రభుత్వం అమలు చేయనున్న తల్లికి వందనం ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

తిరువూరు నియోజకవర్గంలో ..

తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు మండలంలో గత ఏడాది 4,200 మంది విద్యార్థులు, గంపలగూడెం మండలంలో 6,200 మంది విద్యార్థులు, విస్సన్నపేట మండలంలో 4,900 మంది విద్యార్థులు, ఎ. కొండూరు మండలంలో 4,300 మంది విద్యార్థులు మొత్తం 19,600 మంది విద్యార్థులు అమ్మఒడి పథకం ద్వారా లబ్ధిపొందారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అయితే తల్లికి వందనం పథకం కుటుంబంలోని ఒక్కరికే ఇస్తారని చెబుతుండటంపై తల్లులు ఆందోళన చెందుతున్నారు.

వందనం కోసం ఎదురుచూస్తున్నా


మా అమ్మాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో పాఠశాలల్లో చదువుతున్న పిల్లల తల్లుల ఖాతాలో ఒకరికి రూ. 15 వేల చొప్పున వేస్తామన్నారు. ఇంత వరకు జమ కాలేదు. ఎప్పుడు పడుతుందో తెలియదు. గత ప్రభుత్వంలో ఈ పాటికే ఖాతాలో జమ అయ్యేది. పిల్లకు ట్యూషన్ ఫీజులు కట్టుకోవాలి. మేము కూలీ పనులు చేసుకుంటేగాని జీవనం గడవదు. ఆర్థికంగా ఇబ్బందిగా ఉంటుంది. త్వరగా జమ చేయాలి.

– మోదుగు మాధురి(చిన్ని), మైలవరం

త్వరితగతిన అమలు చేయాలి


తాము అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరుతో ఒక కుటుంబంలో స్కూల్‌కు వెళ్లే పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ ఆర్థికసాయం అందిస్తామని కూటమి హామీ ఇచ్చింది. పాఠశాలలు ప్రారంభమయ్యాయి. నాకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరినీ ప్రైవేటు పాఠశాలకు పంపిస్తున్నా. ఫీజులు కట్టమని పాఠశాల యాజమాన్యం అడుగుతోంది. కూటమి ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే పథకాన్ని అమలు చేయాలి.

– వి. శ్రీలక్ష్మి, మునగపాడు, జి.కొండూరు మండలం

నగదు జమ కాలేదు


కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి వారి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాము. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. తల్లికి వందనం పథకం కింద నేటికీ నగదు జమ కాలేదు. ప్రైవేటు పాఠశాలలో ఫీజుల చెల్లింపునకు అప్పులు చేయాల్సి వచ్చింది

-వి.ధనలక్ష్మి, కుదప, రెడ్డిగూడెం మండలం

తల్లికి వందనం మంజూరు కాలేదు


మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం పథకం కింద వారి అకౌంట్లలో నగదు జమ చేస్తామన్నారు. నేటికీ నగదును జమ చేయలేదు. ఎప్పుడు విడుదల చేస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

-మరీదు విజయకుమారి, కుదప, రెడ్డిగూడెం మండలం

ఆర్థిక భరోసా కలుగుతుంది


తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేస్తే మా లాంటి పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుంది. నాకు ఒక కూతురు, ఒక కుమారుడు. నా పిల్లలు ఇద్దరినీ ప్రభుత్వ బడికే పంపుతున్నా. తల్లికి వందనం అమలైతే నా ఇద్దరు పిల్లల చదువులకు అవసరమైన ఇతర ఖర్చులకు ఉపయోగపడతాయి.

- తుంగం వెంకటరమణ, గంగినేని గ్రామం, జి.కొండూరు మండలం

హామీని అమలు చేయాలి


నా పిల్లలు ఇద్దరు నూజివీడు ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నారు. చంద్రబాబు ఎంతమంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు ఇస్తానని చెప్పిన మాటలు విని పిల్లల ఫీజు కట్టుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సంతోషపడ్డాం. కానీ ఇప్పుడు ఇంటికి ఒకరికే ఇస్తానని అనడం దారుణం. ఇచ్చిన హామీని కచ్చితంగా అమలు చేయాలి.

- జి.విజయదుర్గ, ఆగిరిపల్లి

ఒక్కరికి మాత్రమే అంటే మోసమే


తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టాక మాట మార్చడం ప్రజలను మోసం చేయడమే అవుతుంది. హామీ మేరకు ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇవ్వాలి.

- ప్రియాంక, చనుబండ, చాట్రాయి మండలం

క్లుప్తంగా

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే ఉద్యోగులకు నూతన పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని బ్రాంచి కార్యదర్శి గద్ద సురేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైల్వే కార్మికులు, ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయమని, సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఓబీసీ అసోసియేషన్ చైర్మన్ ప్రసాద్, కోశాధికారి రాజేష్‌ఖన్నా, అధ్యక్షుడు పి.శివనాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు దాసరి డేవిడ్‌రాజు, గూడవల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గానుగపాడు(తిరువూరురూరల్): విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని తిరువూరు మండలం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం గురువారం పాఠశాలలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పదో తరగతి పిల్లలు మంచి ఫలితాలు సాధించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పౌష్టికాహారం అందించడంతో పాటు ఏకాగ్రతతో చదివేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఉపాధ్యాయులు రాంప్రదీప్, రాజేంద్రప్రసాద్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లికి ప్రత్యేక బస్సు సర్వీసు

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తూర్పుగోదావరి జిల్లా వాడపల్లికి తిరువూరు నుంచి ప్రతి శుక్రవారం రాత్రి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామని ఆర్టీసీ తిరువూరు డీఎం వేణు తెలిపారు. ఈ బస్సు శుక్రవారం రాత్రి 10 గంటలకు తిరువూరులో బయలుదేరి సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు మీదుగా వాడపల్లి చేరుతుందన్నారు. వేంకటేశ్వరస్వామి దర్శనానంతరం తిరిగి శనివారం ఉదయం 9 గంటలకు వాడపల్లిలో బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు తిరువూరు చేరుతుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో టికెట్లు అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. తిరువూరు ప్రాంత ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్: 98856 61835 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌ల అందజేత




తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థినులకు తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు గురువారం ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి బీటెక్ చదవనున్న విద్యార్థినులలో 17 మందిని గుర్తించి వీటిని అందజేశారు. పేద విద్యార్థినులకు ప్రోత్సాహాన్నందించేందుకు వారి ఇంజినీరింగ్ విద్యకు అవసరమైన ల్యాప్‌టాప్‌లు అందజేశామని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. స్థానిక దారా టౌన్‌షిప్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

చాట్రాయి: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనాభా పెరుగుదల వల్ల లాభ నష్టాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. చాట్రాయిలో పీహెచ్‌సీ వైద్యురాలు ఎం.జ్యోతి ఆధ్వర్యంలో, తుమ్మగూడెంలో ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు.

తిరువూరులో ఈయూ ఆవిర్భావ దినోత్సవం



తిరువూరు: ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ఎంప్లాయీస్ యూనియన్ విశేష కృషి చేస్తోందని రీజనల్ సహాయ కార్యదర్శి ఎంవీకే రావు అన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద గురువారం నిర్వహించారు. యూనియన్ పతాకాన్ని సీనియర్ కార్మికుడు రామారావు ఆవిష్కరించారు. ఎంవీకే రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని విలీనం చేసినప్పటికీ కార్మికుల సంక్షేమమే అజెండాగా పనిచేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ గతంలో పలు డిమాండ్ల సాధనలో పైచేయిగా ఉందని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


షేక్ మహ్మద్ నూర్


పామర్తి శైలజ


తల్లిబోయిన కావ్య


ఆముదాల అనూ


లావణ్య

నూజివీడు: మండలంలోని మీర్జాపురం హైస్కూల్‌లో పదో తరగతి చదివిన విద్యార్థిని పామర్తి శైలజ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. శైలజ పదో తరగతిలో 579 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది. ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన శైలజను, ఆమె తల్లిదండ్రులను హైస్కూల్ హెచ్‌ఎం డీవీఎల్ పుష్పలత, ఉపాధ్యాయులు అభినందించారు. గొల్లపల్లి హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులకు ట్రిపుల్‌ఐ టీలో సీట్లు లభించాయి. ఆముదాల అనూ, తల్లిబోయిన కావ్యశ్రీలకు పదో తరగతిలో 570 మార్కులు వచ్చాయి. గురువారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఎంపిక జాబితాలో వీరిలో ఆముదాల అనూ నూజివీడు ట్రిపుల్ ఐటీలోను, తల్లిబోయిన కావ్యశ్రీ ఒంగోలు ట్రిపుల్‌ఐటీలోనూ సీటు సాధించారు. వీరిని ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.రవీంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. చిన్నంపేట జెడ్పీ హైస్కూల్‌కి చెందిన దన్నె మధు, అడ్డగట్ల భవిత (ఒంగోలు), జుబ్బూరి యస్వంత్(నూజివీడు), చనుబండ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ మహ్మద్ నూర్ (ఒంగోలు), చనుబండ ఉషోదయ స్కూల్‌కి చెందిన దేవరకొండ లోహిత్య (ఒంగోలు) ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. సీట్లు సాధించిన విద్యార్థులను ఎంఈఓ వీఎస్‌వీ బ్రహ్మాచారి అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి నాగులూరు విద్యార్థిని ఎంపిక

రెడ్డిగూడెం: మండలంలోని నాగులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పేటేటి లావణ్య ఒంగోలులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికై ందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం. వరలక్ష్మి తెలిపారు. విద్యార్థిని పదో తరగతిలో 600 మార్కులకు గాను 569 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచిందని చెప్పారు. విద్యార్థిని పేటేటి లావణ్యను పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

- **ముసునూరు:** మండలంలోని వివిధ పాఠశాలలకు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ముసునూరులోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యార్థినులు పావని, హాసిని, వెన్నెల నూజివీడు ట్రిపుల్ ఐటీకి, గోపవరం హైస్కూల్ విద్యార్థి దేవరపల్లి సంజన శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. వేల్పుచర్ల హైస్కూల్ విద్యార్థి షణ్ముఖ వెంకట సాయి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారని హెచ్‌ఎంలు ప్రవీణ, శ్రీనివాస్, నాగేంద్రరావు తెలిపారు.

ఆగిరిపల్లి అభివృద్ధికి సహకరించండి

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి అభివృద్ధికి సహకరించాలని మాజీ సర్పంచ్ సగ్గుర్తి రమేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాతూరి రవి, వైశ్య ప్రముఖులు మడుపల్లి గోపాల్ అన్నారు. గురువారం ఆగిరిపల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆగిరిపల్లిలో సుమారు 12 వేల మంది జనాభా నివసిస్తున్నారని, గ్రామంలో డ్రెయినేజీ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, గన్నవరం రోడ్డు చాలా అధ్వానంగా ఉందని, మెట్ల కోనేరు వద్ద ఉన్న శ్మశాన వాటిక చెట్లు, తుప్పలు పెరిగి తీవ్ర సౌకర్యంగా ఉందని వారు తెలిపారు. శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి ఘాట్ రోడ్ వేస్తే టూరిజం ప్రదేశంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. ఇప్పటికే సగం పూర్తయిన పంచాయతీ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, పీఏసీఎస్ కేంద్రం శిథిలావస్థకు చేరుకుందని, వెంటనే నూతన భవనాన్ని నిర్మించి జిల్లాలోనే ఆగిరిపల్లి అభివృద్ధిలో ముందంజలో ఉండేలా సహకరించాలని మంత్రి కొలుసు పార్థసారథిని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు నెరసు పుణ్యవతి, బండి స్వరూపరాణి, ఉలాస బుజ్జి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి

ముసునూరు: పాఠశాల ప్రాంగణాలు, పరిసరాలు, టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు ఆదేశించారు. రమణక్కపేట మెయిన్, అక్కిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. టాయిలెట్లు, మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మంచినీటి నాణ్యతలను పరిశీలన చేయించి, రికార్డులను పాఠశాలల్లో ఉంచాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, నిర్వహణ రికార్డులను, పాఠశాలల రికార్డులను తనిఖీ చేశారు.


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ

డీపీఆర్‌టీయూ శాఖ మండల అధ్యక్షుడిగా నాగరాజు

ఆగిరిపల్లి: డీపీఆర్‌టీయూ ఆగిరిపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా సీతారాంపురం మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన ఎన్నికలో కార్యదర్శిగా అమ్మవారి గుడి ప్రాథమిక పాఠశాలకు చెందిన వంశీకృష్ణ, మహిళా కార్యదర్శిగా సుహాసిని, ఉపాధ్యక్షురాలిగా సుహాసిని, గౌరవ అధ్యక్షురాలిగా లక్ష్మి ఎన్నికయ్యారు.

22 మందికి పాఠశాలలో ప్రవేశం

ఆగిరిపల్లి: ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ విద్యా విధానం మరింత బలోపేతం చేద్దామని ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ అన్నారు. నెక్కలం గొల్లగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 22 మంది విద్యార్థులను కొత్తగా పాఠశాలలో చేర్పించారు. ప్రధానోపాధ్యాయిని చూడామణి, ఉపాధ్యాయులు ఝాన్సీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రెడ్డిగూడెం: గ్రామాల్లో నూతన లైన్ల పునరుద్ధరణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రెడ్డిగూడెం ఏఈ కిరణ్ తెలిపారు. రంగాపురం, నాగులూరు, ఓబులాపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పెంపు

తిరువూరు: డిగ్రీ కళాశాలల్లో చేరికకు ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి గడువు పొడిగించిందని తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు తెలిపారు. ఈ నెల 10తో గడువు ముగియగా, ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు ఉన్నాయని చెప్పారు.

వరి నారులో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి

లక్ష్మీపురం(తిరువూరురూరల్): ఖరీఫ్ వరినారులో ఊదా తెగులు సోకుతున్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో గురువారం రైతులకు ఖరీఫ్ వరిసాగులో మెలకువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఊదా తెగులు నివారణకు ఎకరా నారుమడికి బ్యూటాక్లోర్ లేదా బెంథియా కార్బ్ ఒకటిన్నర లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 7, 8 రోజుల తర్వాత నారుమడిలో నీరు తీసి వేసి పిచికారీ చేయాలని సూచించారు. కౌలుదారులు తప్పక కౌలు రైతు కార్డులు తీసుకోవాలని, పంటలను ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

14న నేత్ర వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అయాన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన గొల్లపూడి గ్రామం బొడ్డురాయి సెంటర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని హాస్పటల్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాస్పటల్ చీఫ్ డాక్టర్ బషీర్ అహ్మద్ మయాఖ్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు. అవసరమైన వారికి రాయితీపై శస్త్ర చికిత్సలు చేస్తారని, కళ్లజోళ్లు అందజేస్తారని చెప్పారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

మండల సమావేశంలో వైస్ ఎంపీపీ షేక్ రహీం

మైలవరం: మైలవరం మండలంలోని పలు గ్రామాలలో అక్రమ వెంచర్లు పెరిగిపోతున్నాయని, అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వైస్ ఎంపీపీ షేక్ రహీం అన్నారు. వీటిపై విచారణ చేసి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పి. శ్రీనివాస్‌ను కోరారు. స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మైలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి అధ్యక్షతన గురువారం జరిగింది. వైస్ ఎంపీపీ రహీం మాట్లాడుతూ మైలవరం మండలంలో పరిశుద్ధ్యం సరిగా లేదని, అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండల హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. నాయక్ మాట్లాడుతూ మైలవరం మండలంలో మొత్తం 4,075 ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని చెప్పారు. వీటిలో ఇప్పటికే 1,363 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. 2,712 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్ అందుబాటులో ఉందని, కావాల్సిన వారు గృహ నిర్మాణ శాఖాధికారులను సంప్రదించాలని కోరారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కౌలు రైతుల గుర్తింపు కార్డుల జారీపై గ్రామ సభ

నూజివీడు: కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయడం వల్ల భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదని, కౌలు కార్డుల కోసం దరఖాస్తులపై భూ యజమానులు సంతకం చేయాలని నూజివీడు ఏడీఏ జి. విద్యాసాగర్ అన్నారు. కౌలు గుర్తింపు కార్డుల జారీపై గ్రామ సభ తుక్కులూరు రైతు సేవా కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులుంటేనే రైతులకు ప్రభుత్వ పరంగా లభించే రాయితీలు, పథకాలు వర్తిస్తాయన్నారు. తహసీల్దార్ ఏవీ శాస్త్రి మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డుల జారీలో వీఆర్‌ఏలదే ముఖ్యపాత్ర అని అన్నారు. వీఆర్వోల లాగిన్ నుంచే కౌలు గుర్తింపు కార్డులను జారీ చేస్తారన్నారు. కౌలు గుర్తింపు కార్డుల కాల పరిమితి 11 నెలలు మాత్రమేనని, భూ యజమానులు ఎవరూ ఈ కార్డు గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి, ఉద్యాన సహాయకుడు ఎస్.చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.


తుక్కులూరులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్యూర్ అండగా నిలుస్తుంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ (ప్యూర్) స్వచ్ఛంద సంస్థ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, సాధికారత కోసం పని చేస్తోందని సంస్థ సీఈఓ శైలా తాళ్లూరి (యూఎస్‌ఏ) అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం ఫెర్రిలోని ప్రభుత్వ భవిత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అత్యవసరాల పిల్లలకు 36 అత్యాధునిక చక్రాల కుర్చీలు, అటాచ్‌డ్ కమోడ్‌లు, ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ పిల్లలకు 3 ప్రత్యేక కుర్చీలు, 10 వినికిడి పరికరాలను, అలాగే హనుమాన్ జంక్షన్‌లోని జేఎంజే స్వధార్ హోమ్‌కు శైలా తాళ్లూరి 20 బంకర్ బెడ్‌లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ డెప్యూటీ డైరెక్టర్, స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. ఉమామహేశ్వరరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ బీవీఎస్ కుమార్ మాట్లాడారు. మండల అధికారి పుష్పలత, అన్నపూర్ణ, చంద్రావతి, శాంతి పాల్గొన్నారు.



విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ

మైలవరం: విద్యార్థులు చేతరాతను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని శ్రీ లీలావతి పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ అన్నారు. మంచి చేతిరాత వారోత్సవాల సందర్భంగా శ్రీ లీలావతి పాఠశాలలో విద్యార్థులకు చేతి రాతపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో ప్రజాదర్బార్

విస్సన్నపేట: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలను ఎమ్మెల్యే స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

